దానికి నలభై రెండు ఆనపకాయలు కాసాయి. నాస్తికుడు వాటిని కోసి సద్గురువు దగ్గరకి తీసుకెళ్ళాడు. సద్గురువు ఆ కాయలన్నిటిని తూకం వేయించాడు. అవి మొత్తం వంద కిలోల బరువున్నాయి.

నాస్తికుడు తన ప్రశ్నలని సద్గురువుకి మళ్ళీ గుర్తు చేసాడు. సద్గురువు అతని వంక వాత్సల్యంగా చూసి చిరునవ్వుతో చెప్పాడు.

"నీ సందేహాలకి సమాధానాలు చెప్తాను. కాకపోతే ఇందులో నాకు అర్థం కాని ఓ సంగతి చెప్పు."

"ఏమిటది?" ప్రశ్నించాడు నాస్తికుడు.

"గ్రాము బరువు కూడా లేని విత్తనాన్ని ఇరవై కిలోల మట్టిలో పాతావు కదా! మరి అందులోంచి వంద కిలోల ఆనపకాయలు ఎలా వచ్చాయి?"

నాస్తికుడికి సమాధానం తట్టలేదు.

"నా ప్రశ్నకి సమాధానం ఏదో, నీ ప్రశ్నలకీ అదే సమాధానం." నవ్వుతూ చెప్పాడు సద్గురువు.

## 9. కనువిప్పు

ఒకతని దగ్గర ఓ అందమైన గుర్రం వుంది. పూర్తిగా తెల్లగా, నిగనిగలాడుతూ వుండే అది చురుగ్గా పరిగెత్తగలిగేది. దాన్ని చూసి ముచ్చటపడి ఇంకొకతను దాన్ని తనకి అమ్మమని కోరాడు. అందుకతను సమ్మతించలేదు. ఆ గుర్రం మీది కోరికని చంపుకోలేక బేరసారాలకి దిగాడు.

"పైకంతో పాటు నా దగ్గరున్న ఆవుని కూడా ఇస్తాను." చెప్పాడు.

అయినా గుర్రం యజమాని దాన్ని అమ్మడానికి ఒప్పుకోలేదు.

"పోనీ ఐదు ఆవులిస్తాను."

ససేమిరా అన్నాడు గుర్రం యజమాని.

"సరే. నాదగ్గరున్న పది ఆవులూ నీకిచ్చేస్తాను. దయచేసి నీ గుర్రం ఇవ్వు." ఆఖరి ప్రయత్నం చేసాడతను.

అందుకు కూడా అతను వప్పుకోలేదు. వంచనతోనైనా సరే ఆ గుర్రాన్ని చేజిక్కించుకోవాలని అతను ఒక పథకం ఆలోచించాడు.

గుర్రం యజమాని దైవ భక్తుడు, దాత, బీదలంటే దయ గలవాడు. అతను వెళ్ళే దారిలో ఇతను భిక్షగాడి వేషం వేసుకుని కూర్చున్నాడు. గుర్రం మీద అతను వచ్చేప్పుడు మూలగడం ప్రారంభించాడు. మోసపు భిక్షగాడి దీన స్థితికి జాలిపడి, తన గుర్రం ఎక్కమని, వైద్యుడి దగ్గరకి తీసుకెళ్తానని చెప్పాడు గుర్రం యజమాని.

"చాలా రోజులుగా తిండి లేదు. గుర్రం మీద కూర్చునే ఓపిక లేదు." చెప్పాడు భిక్షగాడి వేషంలోని మోసగాడు.

దాంతో గుర్రం యజమాని భిక్షగాడిని గుర్రం మీదకి ఎత్తి కూర్చోపెట్టి, తను గుర్రంతో పాటుగా నడవసాగాడు. కొద్ది దూరం వెళ్ళగానే భిక్షగాడి వేషంలోని మోసగాడు దాన్ని దౌడు తీయించాడు.

మోసం తెలుసుకున్న గుర్రం యజమాని గట్టిగా అరిచి చెప్పాడు.

"నువ్వు గుర్రాన్ని దొంగిలించిన విషయం మాత్రం ఎవరికీ చెప్పకు."

"ఏం? నువ్వు మోసపోయిన సంగతి ఎవరికీ తెలియకూడదనా?" ప్రశ్నించాడు మోసగాడు వేళాకోళంగా.

"కాదు. ఇది విన్నవారు నిజమైన భిక్షగాడు ఎవరైనా ఏదైనా జబ్బుతో దారిపక్కన పడివుంటే, మోసగాడేమోనని అతనికి సహాయం చేయరన్న భయంతో." చెప్పాడు గుర్రం యజమాని.

ఆ మాటలకి ఆ మోసగాడికి కనువిప్పు కలిగింది. ఆ గుర్రాన్ని దాని యజమానికి అందచేసి క్షమాపణలు కోరాడు.

## 10. ప్రార్థన

అది 1912వ సంవత్సరం. బ్రిటన్‌లోని బోల్టన్ అనే ఊళ్ళోని చర్చ్‌లో ఓ పాటర్, అతని భార్య చాలా కాలంగా పని చేస్తున్నారు. వృద్ధాప్యం వల్ల